www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 22 ఏప్రిల్ 2023
5
అన్నమయ్య

కనుమరుగవుతున్న చెరకు సాగు

- నాడు 30 వేల ఎకరాల్లో సాగు
- 10 వేలకు పడిపోయిన సాగు విస్తీర్ణం
- గిట్టుబాటు ధరల్లేక విలవిల
- భారంగా మారిన పెట్టుబడులు
- ఆందోళనలో రైతులు

ప్రజాశక్తి-పెద్దమండ్యం

జిల్లాలో చెరకు సాగు చితికిపోయింది. ఒకప్పుడు జిల్లాలో 'మూడు పువ్వులు.. ఆరు కాయలుగా' వెలుగొందిన చెరకు సాగు ప్రస్తుతం కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడింది. ఎంతో కష్టపడి పండించిన పంటకు సరైన ధర లేక చెరకు రైతులు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు. ఒకప్పుడు జిల్లాలో 30 వేల ఎకరాల నుంచి 40 వేల ఎకరాల్లో చెరకు పంటను రైతులు సాగు చేస్తుండేవారు.

గిట్టుబాటు లేక తగ్గిన సాగు..

చెరకు పంట సాగు చేసిన రైతులకు సరైన గిట్టుబాటు ధరలు లేకపోవడంతో భారీగా సాగు విస్తీర్ణం తగ్గిపోయింది. అరకొర సాగైన పంటను కూడా వివిధ రూపాల్లో రైతులు కష్టపడుతూ విక్రయించుకుంటున్నారు. కొద్ది మంది రైతులు మాత్రమే ఫ్యాక్టరీలకు తరలిస్తారు. మరి కొంత మంది రైతులు గానుగ ఆడిస్తున్నారు. చాలా మంది రైతులు ఖర్చులకు బయపడి సంతల్లో వ్యాపారం కోసం సాగు చేస్తున్నారు. దుక్కి దున్నేటప్పుడు నుండి పంట పండించే దాకా డబ్బులు రాకపోవడంతో రైతులు ఆర్థిక ఇబ్బందులు ఎదురు కొంటున్నారు. ఫ్యాక్టరీ యాజమాన్యం నగదు చెల్లించినప్పుడు తీసుకుంటూ అంతవరకు పంట సాగుకు చేసిన అప్పులకు వడ్డీలు కట్టుకుంటున్నారు.

ఇబ్బందిగా మారిన ఆంక్షలు

నల్లబెల్లంపై ఆంక్షలు లేని సమయంలో విరివిగా బెల్లం తయారీ చేస్తూ రైతులు బెల్లం అమ్ముకుంటు లాభాలు గడించేవారు. ప్రస్తుతం బెల్లం తయారీ కేంద్రాలు ఎక్కువుగా లేవు. కూలీల ఖర్చు, ప్రమాదాలు వీటిలో దృష్టిలో పెట్టుకొని రైతులు బెల్లం తయారీని నిలిపి వేశారు. పల్లెల్లో రైతులు అక్కడక్కడ కొంత మంది రైతులు మాత్రమే బెల్లం తయారు చేస్తున్నారు. ఈ బెల్లం తయారీలో కూడా నష్టాలు అధికం అవుతున్నాయని రైతులు వాపోతున్నారు.

భారంగా మారిన పెట్టుబడులు

బెల్లం తయారీకి ఖర్చులు అధికం కావడంలో గిట్టుబాటు ధరలు లేక రైతులు విలవిల్లాడిపోతున్నారు. కిలో బెల్లం తయారీకి దాదాపు40-50 వరకు ఖర్చు అవుతోంది. చెరకు సాగు మొదలు పెట్టినప్పుడు దుక్కి దున్నేటప్పుడు గంటకు రూ.వెయి నుంచి రూ. 1200 ఖర్చు అవుతుంది. ట్రాక్టర్ ఖర్చులకు 10 వేలుకు పైగా అవుతుంది. చెరకు సాగు మద్యలో యూరియా, కూలి ఖర్చులకు ఎకరాకు రూ.లక్ష వరకు ఖర్చు అవుతోంది. ఒక కూలి ఖర్చు సుమారు రూ.వెయ్యి ఇవ్వాల్సి ఉంది. లేకపోతే కూలీలు దొరకడం కష్టంగా మారింది.

సంస్కృతిని వీడలేక...

పాత సంస్కృతిని వీడలేక నష్టమూనా చెరకు గానుగ మంచిదని బావిస్తున్నారు. చిన్న, సన్నకారు రైతు లు ఖర్చులు భరించలేక కుటుంబ సభ్యులతోనే చెరకు గానుగాలు ద్వారా నల్లబెల్లం తయారు చేస్తున్నారు. వ్యాపారులు తక్కువ రేటు ఉన్నప్పుడే రైతుల నుండి నల్లబెల్లం కొనుగోలు చేస్తున్నారు. రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. చెరకు రైతులు అభివృద్ధి చెందాలంటే చెరకు పంటకు సైతం ఇన్స్యూరెన్స్ సౌకర్యం కల్పిస్తే మంచిదని పలువురు రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కనీసం చెరకు పంటలలో వ్యవసాయ అధికారులు సరైన సూచనలు, సలహాలు ఇవ్వకపోవడంతో పంట దిగిబడి తక్కువ వస్తుందని రైతులు వెల్లడిస్తున్నారు. వ్యవసాయ అధికారులు చెరకును కొనుగోలు చేసి రైతులు గిట్టుబాటు ధర కల్పించాలని పలువురు కోరుతున్నారు.

నల్లబెల్లం తయారీపై ఆంక్షలు ఎత్తివేయాలి

ప్రభుత్వం గతంలో నల్లబెల్లం తయారీపై ఆంక్షలు విధించింది. ఈ ఆంక్షలు ఎత్తివేయాలి. బెల్లంకు ప్రభుత్వం గిట్టుబాట ధర కల్పించి కొనుగోలు చేయాలి. చెరకు పంట పండించేందుకు రుణాలు మంజూరు చేయాలి.

- తుమ్మల మహేశ్వర, రైతు, పెద్దమండ్యం

చెరకు రైతుకు ప్రోత్సహమేదీ?

చెరకు రైతుకు ప్రభుత్వ ప్రోత్సాహం దారుణంగా వుంది. కనీసం అధికారులు సలహాలు, సూచనలు కూడా ఇవ్వడం లేదు. మా పోలాలల్లో చెరకు తప్ప వేరే పంట సరిగ్గా పండదు. గత్యంతరం లేక చెరకును పండిస్తున్నాం. గిట్టుబాటు ధర లేక తల్లడిల్లుతున్నాం. అధికారులు చెరకు రైతులకు ప్రోత్సాహం అందించాలి.

- నారా గంగాధర్, రైతు, పెద్దమండ్యం.

చక్కెర ఫ్యాక్టరీలకు తరలిస్తే గిట్టుబాటు ధర

రైతులు పండించిన చెరకును చక్కెర పరిశ్రమలకు తరలిస్తే గిట్టుబాటు ధర వచ్చే అవకాశం ఉంది. మండలంలోని వెలిగల్లు, కలిచర్ల, పెద్దమండ్యం పంచాయతీల్లో చెరకు సాగు చేశారు. దగ్గర్లో ఫ్యాక్టరీలు లేకపోవడంతో ఇబ్బందిగా మారింది. సంతలల్లో అమ్ముకోవటం, గానుగ ఆడుకోవటం వలన బెల్లం అమ్ముకోచ్చు. జ్యూస్ బండ్లకు అమ్మితే కొంత మేరకు నష్టాలు రాకుండా చూసుకోవచ్చు.

- సురేష్ కుమార్‌నాయక్, ఎఒ, పెద్దమండ్యం.

బెల్లం తయారు చేస్తున్న రైతు

టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు : గిరీష

ప్రజాశక్తి-రాయచోటి

జగనన్న కాలనీలలో అన్ని శాఖలు సమన్వయంగా పనిచేసి మౌలిక వసతులను వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ గిరీష సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ నుంచి జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాల ప్రగతిపై హౌసింగ్, విద్యుత్, ఆర్‌డబ్ల్యుఎస్, పంచాయతీరాజ్, డ్వామా, ఎంపిడిఒలు, మండల ఇంజినీరింగ్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించి గృహ నిర్మాణాల పురోగతి చేపట్టాల్సిన చర్యలపై దిశ నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల తాను కొన్ని హౌసింగ్ లేఅవుట్లను స్వయంగా సందర్శించినప్పుడు తన దృష్టికి కొన్ని సమస్యలు వచ్చాయని పేర్కొన్నారు. ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం కొరవడినట్లు తెలుస్తోందన్నారు. పేదవారికి ఒక గూడు కల్పించాలనే సదుద్దేశంతో ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న లేఅవుట్ కాలనీలలో వంద శాతం మౌలిక వసతులు కల్పించడం అధికారుల బాధ్యతని పేర్కొన్నారు. కురబలకోట మండలం బ్రాహ్మణ వడ్డేపల్లి, కంటేవారిపల్లె లేఔట్లలో విద్యుత్ స్తంభాలు ఐదడుగుల లోతు పాతాల్సి ఉండగా, మూడు అడుగులలో మాత్రమే నాటారన్నారు. కనెక్షన్ ఇచ్చిన తర్వాత పోల్ పడిపోతే ఇబ్బందులు ఏర్పడతాయని పేర్కొన్నారు. పోల్స్ నాటేటప్పుడు ఖచ్చితంగా మార్గదర్శకాలు పాటించాల్సిందేనని స్పష్టం చేశారు. మే నెలాఖరులోగా అన్నిచోట్ల విద్యుత్ లైన్ల కనెక్షను పూర్తి చేయాలన్నారు. కాలనీలలో నీటి వసతికి సంబంధించి బోరు, ట్యాంకు, కుళాయి కనెక్షన్ రోడ్డుపక్కగా ఉండాలని పేర్కొన్నారు. జగనన్న ఆర్చ్ నిర్మాణాలను కూడా త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. జిల్లాలో ఇంకా అకౌంట్ జనరేట్ చేయని 145 ఉన్నాయని, వాటికి వెంటనే అకౌంట్లు జనరేట్ చేయించాలని పేర్కొన్నారు. అకౌంట్ నెంబర్లు లేకుండా ఇంటి స్టేజ్‌లను తదుపరి స్థాయికి ఎలా మంజూరు చేస్తారని గృహ నిర్మాణ శాఖ అధికారులను ప్రశ్నించారు. ప్రతివారం స్టేజి వారీగా నిర్మాణాలలో ప్రగతి ఉండాలని తెలిపారు. టెలి కాన్ఫరెన్స్‌లో హౌసింగ్, ఆర్‌డబ్ల్యుఎస్, విద్యుత్, పంచాయతీ రాజ్, డ్వామా తదితర శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అప్పులబాధతో యువ రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి -చిట్వేలి

పంటల సాగుకు చేసిన అప్పులు ఎక్కువ కావడంతో యువ రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని కె.కందులవారిపల్లెలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన మేరకు...తనకున్న రెండున్నర ఎకరాలతో పాటు మరో పది ఎకరాలు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేసేవారు. ఆరుగాలం కష్టించి చేసిన వ్యవసాయం లాభదాయకం లేక, పెరిగిపోతున్న వడ్డీలు పేరుకుపోయాయి. పొలంలో ఆదాయం రాకపోగా అప్పులు పెరిగిపోవడంతో మనస్థాపానికి గురయ్యారు. కందుల జగదీశ్వర్‌బాబు (36) గురువారం రాత్రి విషపు గుళికలు తిని ఆత్మహత్యకు ప్రయత్నించారు. గమనించిన బంధువులు ఆయనను హుటాహుటిన నెల్లూరు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో శుక్రవారం ఉదయం మరణించారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అప్పులపాలైన రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బిజెపితో దేశానికి ప్రమాదం

సిపిఎం-సిపిఐ రాజకీయ ప్రచార భేరిలో నాయకులు

వాల్మీకిపురం : మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు

ప్రజాశక్తి-వాల్మీకిపురం

బిజెపితో దేశానికి తీవ్ర ప్రమాదం ఉందని.. రానున్న ఎన్నికల్లో బిజెపిని ఇంటికి సాగనంపడానికి అన్ని రాజకీయ పార్టీలు, ప్రజలు కలసి రావాలని సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు శ్రీనివాసులు, నరసింహులు పిలుపునిచ్చారు. సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జీపు జాతా వాల్మీకిపురంకు చేరుకుంది. శుక్రవారం స్థానిక గాంధీ బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వామపక్ష, లౌకిక, ప్రజాతంత్ర శక్తులు అందుకు నడుం బిగించాలన్నారు. నిరంకుశ, మతోన్మాద బిజెపిని సాగనంపుదాం, మోడీ ప్రభుత్వం హిందూత్వ కార్పొరేట్ కూటమనీ, ఓ వైపు దేశాన్ని హిందూ రాష్ట్రంగా మార్చాలని ప్రయత్నిస్తూనే మరో వైపు కార్పొరేట్లకు కొమ్ముకాస్తోందని విమర్శించారు. దళితులు, ముస్లిం మైనార్టీలకు, మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ధ్వజమెత్తారు. అనంతరం ప్రజలకు కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు రమణారెడ్డి, జిల్లా కార్యదర్శి రామచంద్ర, నాయకులు రమేష్ బాబు, మహేష్, కృష్ణప్ప, సాంబశివ పాల్గొన్నారు. **నిమ్మనపల్లి:** ప్రధాని మోడీ దేశ సంపదను తన మిత్ర బృందమైన అంబానీ, ఆదాని లకు దోచిపెడుతున్నారని, దేశ సంపదను కొల్లగొడుతున్న బిజెపిని ఇంటికి సాగనంపి దేశాన్ని కాపాడుదామని సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు, సిపిఐ జిల్లా కార్యదర్శి పి.ఎల్ నరసింహులు అన్నారు. దేశంలో బిజెపి ఆధ్వర్యంలో రాజ్యాంగ విలువలను కాలరాయడానికి మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నారన్నారు. **మదనపల్లె అర్బన్:** సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో ప్రచార భేరి మండలానికి చేరుకుంది. స్థానిక టమోటా మార్కెట్‌లో నిర్వహించిన సమావేశంలో సిపిఎం, సిపిఐ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, కె.మురళి మాట్లాడుతూ ఆసియాలోనే అతిపెద్ద టమోటా మార్కెట్ మదనపల్లిలో ఉందని, ఈ ప్రాంతంలో రైతాంగం అధికంగా టమోటా పైనే ఆధారపడి జీవనం కొనసాగిస్తుందన్నారు. మార్కెట్ కమిటీలు కానీ, అధికారులు కానీ ఏ మాత్రం పట్టించుకున్న పరిస్థితి లేదన్నారు. అధికారులు వ్యాపారస్తులు సిండికేటై రైతాంగాన్ని నిలువునా దోచేస్తున్నారని పేర్కొన్నారు. టమోటా దిగుబడి తగ్గి డిమాండ్ పెరిగి రైతుకి పది రూపాయలు చేతికొస్తున్నప్పుడు ధర నియంత్రణ పేరుతో అధికార యంత్రాంగం పాలకవర్గాలు ఆగమేఘాలపైన మార్కెట్లో వాలిపోతారని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం, సిపిఐ నాయకులు తిరుమల, ఓబులేసు, శోభ, నాగరాజు పాల్గొన్నారు. **రామసముద్రం :** సిపిఐ సిపిఎం ప్రచార భేరి జీపు జాత రామసముద్రం చేరుకుంది. ఈ సందర్భంగా సిపిఐ సిపిఎం జిల్లా కార్యదర్శిలు నరసింహులు శ్రీనివాసులు మాట్లాడుతూ నరేంద్ర మోడీ ప్రభుత్వం రైతాంగ వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని, రైతు వ్యతిరేక చట్టాలను తీసుకొచ్చి ఈ దేశంలో రైతాంగాన్ని పూర్తిగా కార్పోరేట్ సంస్థలకు వ్యవసాయాన్ని అప్పగించే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. ప్రజా రైతు వ్యతిరేక చట్టాలను సమర్థిస్తూ తమ ఎంపీలు పార్లమెంట్లో బలపరుస్తున్నారన్నారు. కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి మురళి, మండల నాయకులు సూరి, ఓబులేసు పాల్గొన్నారు. **కలికిరి :** ప్రధాని మోడీ దేశ సంపదను తన మిత్ర బృందానికి దోచిపెడుతున్నారని, దేశ సంపదను కొల్లగొడుతున్న బిజెపిని ఇంటికి సాగనంపి దేశాన్ని కాపాడుదామని సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు పి.శ్రీనివాసులు, పి.ఎల్.నరసింహులు అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో ప్రచార బేరి-జీపు జాతా కలికిరికి చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో బిజెపి ఆధ్వర్యంలో రాజ్యాంగ విలువలను కాలరాయడానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నారన్నారు.

మదనపల్లె : టమోటా రైతులతో మాట్లాడుతున్న నాయకులు

మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బత్యాల

టిడ్కో ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలి : 'బత్యాల'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

టిడ్కో ఇళ్ల నిర్మాణాలు చేపట్టి బాధితులకు న్యాయం చేయాలని మాజీ ఎమ్మెల్యే బత్యాల చెంగల్రాయుడు అన్నారు. శుక్రవారం ఇళ్ల నిర్మాణాలపై మున్సిపల్ కమిషనర్ ఎం.జనార్ధన్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి హయాంలో పేద, మధ్య తరగతి వారికి తక్కువ ఖర్చుతో సౌకర్యవంతమైన ఇళ్లు నిర్మించాలన్న సంకల్పంతో టిడ్కో ఇళ్ల నిర్మాణానికి పూనుకున్నదని పేర్కొన్నారు. మండలంలోని బోయినపల్లి వద్ద 845 ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారని తెలిపారు. వైసిపి అధికారంలోకి వచ్చాక టిడిపి సంకల్పాన్ని పూర్తిగా నీరుగార్చేందుకు ప్రయత్నం చేస్తోందన్నారు. వెంటనే ఇళ్ల నిర్మాణాలు చేపట్టి లబ్దిదారులకు అందజేయాలని డిమాండ్ చేశారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ పేదరిక నిర్మూలనే టిడిపి ధ్యేయమని తెలిపారు.ఎన్టీఆర్ నాయకత్వంలో పేదల సంక్షేమానికి, అన్ని వర్గాలకు సమాన అవకాశాలను కల్పించడమే కాకుండా పాలనా వికేంద్రీకరణకు నాంది పలికారని పేర్కొన్నారు. తెలుగుజాతి సమగ్రాభివృద్ధికి సంకేతంగా చంద్రబాబు పార్టీ భావజాలాన్ని పుణికిపుచ్చుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర నాయకులు డాక్టర్ సుధాకర్, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మందా శ్రీనివాసులు, పట్టణ అధ్యక్షులు గన్నేసుబ్బ నరసయ్య నాయుడు, మహిళా నాయకురాలు అనసూయమ్మ, గుగ్గిళ్ల చంద్రమౌళి, టిఎన్ఎస్ఎఫ్ నాయకులు రేవూరి వేణుగోపాల్, జడ శివ పాల్గొన్నారు.

ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం

నందలూరు :నందలూరులో శుక్రవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. కొద్ది రోజులుగా ఎండలు తీవ్రంగా మండిపోతున్నాయి. వేడి, ఉక్కపోతతో వృద్ధులు, చిన్నారులు అల్లాడిపోతున్నారు. పలువురు తమ పనులను తీవ్ర ఎండలతో వాయిదా వేసుకుంటున్నారు. ఉదయం సాయంత్రం వేళలో మాత్రమే బయటకు రావడం జరుగుతోంది. వర్షంతో వేడి నుండి కొంతమేర ఉపశమనం దొరికింది. వాన కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. శనివారం రంజాన్ పండుగను జరుపుకోవాల్సిన ముస్లింలు కొంత మేర ఇబ్బందికి లోనయ్యారు. మండల కేంద్రంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని అరవపల్లెలో అంధకారంతో ప్రజలు ఇబ్బందికి గురయ్యారు.

బస్సు షెల్టర్ ప్రారంభం

రాయచోటి : ఎన్‌జిఒ సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షులు చింతం వెంకటరెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన జ్ఞాపకార్థం ఎస్.ఎన్.కాలనీలో ప్రయాణికుల సౌకర్యార్థం బస్సు షెల్టర్ ఏర్పాటు చేశామని ఆయన కుమారుడు మధుసూదన్‌రెడ్డి, కుమార్తెలు నీరజ, జలజ శుక్రవారం తెలిపారు. బస్సు షెల్టర్‌ను మాజీ ఎమ్మెల్సీ పోచంరెడ్డి సుబ్బారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో రాయచోటి మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్, పట్టణ సిఐ సుధాకర్‌రెడ్డి, ట్రాఫిక్ ఎస్ఐ రఫీ, పొత్తుకూరుపల్లె కృష్ణారెడ్డి, బండపల్లి గంగిరెడ్డి, పోలు సుబ్బారెడ్డి, కౌన్సిలర్ నరసింహారెడ్డి, పల్లపు రమేష్, లయన్స్‌క్లబ్ అధ్యక్షులు మహమ్మద్, సాయి ఇంజినీరింగ్ కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ సుధాకర్ రెడ్డి, ప్రేమాలయం వృద్ధులు పాల్గొన్నారు.

బస్సు షెల్టర్‌ను ప్రారంభిస్తున్న సుబ్బారెడ్డి

'వెలిగల్లు పర్యాటక అభివృద్ధికి చర్యలు'

ప్రజాశక్తి-గాలివీడు

వెలిగల్లు ప్రాజెక్టు వద్ద ఆహ్లాదకరమైన వాతావరణం ఉందని, ఇక్కడ పర్యాటక అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ గిరీష ఆదేశించారు. శుక్రవారం మండలంలోని వెలిగల్లు ప్రాజెక్టును కలెక్టర్ సందర్శించి ప్రాజెక్టు సామర్థ్యం, ఎంత వాటర్ నిల్వ ఉంది, చెరువులకు ఎన్ని క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు, రాయచోటి మున్సిపాలిటీకి ఎంత వాటర్ డ్రా చేస్తున్నారు వంటి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టులో నీటి సామర్థ్యం పరిశీలించి, బోటింగ్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అధికారులను సూచించారు. వెలిగల్లు ప్రాజెక్టు వద్ద టూరిజంను ఏ విధంగా అభివృద్ధి చేయవచ్చు వంటి వాటిని కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రాజెక్టు పై భాగంలో ఉన్న కొండపై గెస్ట్ హౌస్ ఏర్పాటుకు స్థల పరిశీలన చేశారు. కొండపైకి వెళ్లేందుకు రోడ్డు ఏర్పాటు కోసం పై భాగానికి నడుచుకుంటూ వెళ్లి పరిశీలించారు. పై భాగంలో గెస్ట్ హౌస్ ఏర్పాటు చేస్తే ప్రాజెక్టు వ్యూ, స్పిల్ వే, రివర్ మొత్తం బాగా కనబడుతుందని, ఇక్కడ మంచి వాతావరణం ఉందన్నారు. టూరిజం శాఖ ప్రాజెక్టు వద్ద అడ్వెంచర్ స్పోర్ట్స్ వంటి అభివృద్ధి పనులు తదితర వాటిపై ఆ శాఖ అధికారిని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. గెస్ట్ హౌస్ సమీపంలోనే ఐదు నుంచి పది కాటేజీలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అందులో భాగంగా ప్రాజెక్టు వద్ద పార్కును కలెక్టర్ సందర్శించి పార్క్ చాలా బాగుందని సంతృప్తి వ్యక్తం చేశారు. పార్కులోనే మంచి స్విమ్మింగ్ పూల్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రాజెక్టు వద్ద ఎలాంటి అభివృద్ధి చేస్తే బాగుంటుందో వాటికి సంబంధించి ప్రణాళికలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. నదిలో చెత్తను వేస్తున్నారని, చెత్తను వేయకుండా చూడాలని, చెత్త వేస్తే ఫైన్ వేయడం జరుగుతుందని బోర్డు పెట్టాలని పంచాయతీ కార్యదర్శిని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం ప్రాజెక్టు వద్ద వెలిసిన ఉమామహేశ్వర స్వామి దేవస్థానంలో కలెక్టర్ స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ శాఖ జిల్లా అధికారి కృష్ణమూర్తి, జిల్లా పర్యాటక శాఖ అధికారి నాగభూషణం, ఇరిగేషన్ శాఖ ఇఇ వెంకటరామయ్య, డిఇఇలు వెంకటేశ్వరరావు, జనార్దన్, తహశీల్దార్, ఎంపిడిఒ పాల్గొన్నారు.

వెలిగల్లు పార్కును పరిశీలిస్తున్న కలెక్టర్ గిరీష

చిరుధాన్యాల సాగును ప్రోత్సహించాలి : 'పంజం'

ఉద్యోగాలు పొందిన విద్యార్థులు

ప్రజాశక్తి-రాయచోటి

చిరుధాన్యాల సాగును ప్రోత్సహించాలని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్లో జిల్లా స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశాన్ని సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుకుమార్‌రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ సలహా మండలిని ప్రభుత్వం ఏర్పాటు చేసిన తర్వాత రైతన్నల సమస్యలు, పలు సలహాలు, సూచనలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రైతన్నల సంక్షేమానికి కృషి చేస్తున్నామన్నారు. రైతులకు కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అన్నీ కూడా వివిధ శాఖల ద్వారా త్వరితగతిన అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. చిరుధాన్యాల సాగును ప్రోత్సహించాలన్నారు. రైతులకు చిరుధాన్యాల యొక్క ఆవశ్యకతను వాటి యొక్క ఉపయోగాలను రైతు భరోసాల ద్వారా రైతులకు అవగాహన కల్పించి, సాగును పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అలాగే మండల స్థాయిలో సలహా మండల సమావేశంలో సభ్యులు తీసుకొచ్చిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. జెసి సత్యనారాయణ మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి అధికారులు కృషి చేయాలన్నారు. సభ్యులు తెలియజేసిన సమస్యలన్నీ ప్రతి ఒక్క అధికారి పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. సమీక్షా సమావేశంలో జిల్లా అటవీ శాఖ అధికారి వివేక్, జిల్లా వ్యవసాయ అధికారిని ఉమామహేశ్వరమ్మ, జిల్లా వ్యవసాయ సలహా మండలి కమిటీ సభ్యులు దిన్నేపాడు రవిరాజు, బోధషావలి, వివిధ శాఖల జిల్లా అధికారులు, వ్యవసాయ సహాయ సంచాలకులు పాల్గొన్నారు.

క్యాంపస్ ఎంపికల్లో 15 మందికి ఉద్యోగాలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

శ్రీ జ్ఞానాంబికా డిగ్రీ కళాశాల నందు బెంగళూరుకు చెందిన బహుళ జాతి సంస్థ హిలియోస్ పతాలజీ ఇండియా లిమిటెడ్ సంస్థ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలలో 15 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కరస్పాండెంట్ ప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ హెలియోస్ సంస్థ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలకు తమ కళాశాలకు చెందిన బయోటెక్నాలజీ బిజెడ్‌సి విద్యార్థులు పాల్గొనగా అందులో ప్రతిభ చూపిన 15 మంది ఆపరేషనల్ మేనేజర్ ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. ప్రతినెలా రూ.31,176 చొప్పున వేతనం అందుతుందన్నారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపల్ రమాదేవి, ప్లేస్మెంట్ ఆఫీసర్ మహేష్ అభినందించారు.

ఉద్యోగాలు పొందిన విద్యార్థులు

భక్తులకు అన్నదానం చేస్తున్న సిబ్బంది

అన్నదానం గొప్పది

ప్రజాశక్తి-కురబలకోట

స్థానిక మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో శుక్రవారం తెట్టులో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. శ్రీ సంతాన వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రథోత్సవంపై సత్యభామ, రుక్మిణీ సమేతంగా స్వామి వారిని ఊరేగించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని మిట్స్ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎన్.విజయభాస్కర్ చౌదరి సూచనల మేరకు యాజమాన్యం అన్న సంతర్పణ ఏర్పాటు చేశారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో చేపట్టిన ఈ కార్యక్రమాన్ని కళాశాల డైరెక్టర్, మదనపల్లె మాజీ జడ్‌పిటిసి సభ్యులు ఎన్.ద్వారకనాథ్‌రెడ్డి ప్రారంభించారు. శుక్రవారం ఉదయం 6గంటల నుంచి సాయంత్రం వరకు సుమారు 10వేల మంది భక్తులు అన్నప్రసాదాలు స్వీకరించారు. తెట్టు గ్రామస్తుల సహకారంతో కార్యక్రమం విజయవంతం అయినట్లు కళాశాల యాజమాన్యం సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తెట్టు, అంగళ్లు సర్పంచులు మనోహర్‌రెడ్డి, విశ్వనాథరెడ్డి జడ్‌పిటిసి చంద్రశేఖర్‌రెడ్డి, నర్సింహులు, కుమార్‌రెడ్డి, టిడిపి మండల ప్రధానకార్యదర్శి రెడ్డిశేఖర్, మహేష్, ఆదిరెడ్డి, గోపి, భక్తులు పాల్గొన్నారు. **ములకలచెరువు :** ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన అధ్యక్షుడు, పిఎసి మెంబర్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ పుట్టినరోజు సందర్భంగా పేదలకు అన్నదానం చేశారు. మండల కన్వీనర్ పోతుల సాయినాథ్ ఆధ్వర్యంలో జనసేన వేడుకలు నిర్వహించారు. మండల కేంద్రంలోని మూడు రోడ్ల కూడలిలో కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచి పెట్టారు. కార్యక్రమంలో జనసేన నాయకులు గోపి క్రిష్ణ, మహేష్, బాబ జాన్, కోటప్ప, నవీన్, మణి,సాయి,శీనా, ఫోరమ్ సూరి, రియల్ ఎస్టేట్ గణేష్ పాల్గొన్నారు. **నందలూరు :** గోపీనేని హిమగిరి యాదవ్ పెద్దకుమారుడు జ్యోతి శ్రీ యాదవ్ పుట్టినరోజు సందర్భంగా నిరుపేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా దాత మాట్లాడుతూ వృద్ధులకు, అనాధలకు అన్నదానం చేయడం సంతోషంగా ఉందని తెలిపారు. కార్యక్రమం మండల బిజెపి అధ్యక్షులు చిన్న రాయుడు, హెచ్ఆర్ పిసి జిల్లా చైర్మన్ దేవేద్ కళ్యాణ్‌రాజ్ పాల్గొన్నారు.

మరో చికాగో పోరాటానికి సిద్ధం కావాలి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పనిగంటలను పెంచుతూ మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లు రద్దు కోసం మరో చికాగో పోరాటానికి సిద్ధం కావాలని ఎఐటియుసి జిల్లా సహాయ కార్య దర్శి సురేష్ కుమార్, నియోజకవర్గ అధ్యక్షులు సలీం బాషా కోరారు. మే 1న మేడే జయప్రదం చేయాలని కోరుతూ శుక్రవారం మేడే కరపత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఎస్.అష్ఫఅలీ, కార్యదర్శి ఎస్.తంబయ్య శెట్టి, నాయకులు ఎస్.జోహార్ బాబు, గంగులప్ప, కుమార్ పాల్గొన్నారు.

శ్రీకృష్ణదేవరాయల విగ్రహావిష్కరణకు తరలిరండి

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

మదనపల్లి పట్టణంలో నిర్మించిన శ్రీకృష్ణదేవరాయల విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి నిమ్మనపల్లి మండల బలిజ సోదరులు భారీ స్థాయిలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బలిజ సేవా సమితి సంఘం నాయకులు శ్రీరాములు పిలుపునిచ్చారు. శుక్రవారం ప్రచారరథం ద్వారా ఎగువ మావిడిగొరిపల్లి, వల్లూరుపల్లి, వెంకోజీగారిపల్లి, నిమ్మనపల్లి, అగ్రహారం, తవళం, బాలినాయనపల్లిలో పాటు మండల వ్యాప్తంగా ప్రచారాన్ని నిర్వహించారు. విజయ నగర సామ్రాజ్యాధినేత, శ్రీకృష్ణదేవరాయల విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం ఈనెల 24న ఉదయం 9:30 గంటలకు పట్టణంలోని మల్లికార్జున కూడలిలో జరుగు తుందని తెలిపారు. కార్యక్రమంలో బలిజ సంఘం నాయకులు శ్రీరాములు, శివకు మార్, ధనంజయ, మెకానిక్ శివ, రామకృష్ణ, శీన, తులసి పాల్గొన్నారు.

మురుగు కాలువను పరిశీలిస్తున్న డాక్టర్ రఫీవుల్లాఖాన్

'ఫ్రైడే డ్రైడేగా పాటించాలి'

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

మలేరియా, డెంగీ, ఇతర వ్యాధులు ప్రబలకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ పి.రఫీవుల్లాఖాన్, మలేరియా సబ్‌యూనిట్ అధికారి వై. ప్రసాద్ యాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం డ్రైడే ఫ్రైడే సందర్భంగా లక్కిరెడ్డిపల్లిలోని నలందనగర్, మిస్పా చర్చి ప్రాంతాలలో పర్యటించి తొట్లెలు, డ్రమ్ములు, నిల్వ ఉన్న నీటిలో అబేట్ ద్రావణాన్ని పిచకారి చేయించి దోమ లార్వ ఉన్న నీటిని సిబ్బందితో తొలగింపజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని నీరునిల్వ ఉన్న డ్రములు, తోట్లు వారంలో ఒకసారి నీటిని తీసివేసి ఒక్క గంట అరబెట్టాలని సూచించారు. దోమల వలన డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా, టైఫాయిడ్ వంటి జ్వరాలు ప్రబలుతాయని జాగ్రత్తలు పాటించాలని పేర్కొన్నారు. ఇంటి చుట్టూ పరిసరాలు పరి శుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. దోమలు ఎక్కువ ఉన్న ప్రాంతాలలో అబేట్ ద్రావణాన్ని పిచకారి చేయించాలని చెప్పారు. గృహంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. జ్వరం, దగ్గు, జలుబు వంటి లక్షణాలు ఉంటే ఆస్పత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఎఎన్ఎంలు, ఆశ వర్కర్లు ప్రతిరోజు గ్రామాలలో పర్యటించి జ్వర పీడితులను గుర్తించి వారికి సరైన మందులు అందించాలన్నారు. కార్యక్రమంలో విస్తరణాధికారి ఎన్.దేవదానం, సూపర్వైజర్ ఎం.సురేంద్రారెడ్డి, ఎఎన్ఎం జవాహిర్ బేగ్ పాల్గొన్నారు.

నిత్య హరిత వేరుశనగ రకాన్ని పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

'నిత్యహరిత' వేరుశనగ రకం పరిశీలన

ప్రజాశకి-కలికిరి

కలికిరి కృషి విజ్ఞానకేంద్రం శాస్త్రవేత్తలు పారుపట్ల పంచాయతీ లోని కురవపల్లి గ్రామంలో కెవి.రెడ్డి వేరుశనగ పొలంలో నిత్య హరిత రకంపై క్షేత్ర పరిశీలనలో భాగంగా క్షేత్ర దినోత్సవం నిర్వహించారు. వారి పరిశీలనలో ఒక వేరుశనగ మొక్కకు 25 నుంచి 30 కాయలు గమనించారు. ఎకరాకు 13 క్వింటాళ్ల వేరుశన కాయలు దిగుబడి రావచ్చునని అంచనా వేశారు. నిత్య హరితరకం రబీ కాలానికి అనువైనదని, దీని ప్రత్యేకత ఒక కాయలో మూడు గింజలు ఉంటాయని వివరించారు. రైతు నిత్య హరిత రకంలో వచ్చిన దిగు దిగుబడిపై సంతృప్తి వ్యక్తం చేసినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో కెవికె శాస్త్రవేత్తలు డాక్టర్. వై.పీరు సాహెబ్, డాక్టర్ కె.మాధురి, ఎస్.సోమశేఖర్, వివిఎ, రైతులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు సహకరించాలి : డిఎస్‌పి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లి సబ్ డివిజన్ పరిధిలోని లారీ, మినీలారీ, ఐచర్, కారు, ప్యాసింజర్ఆటో యజమానులు నిరంతరం అప్రమత్తంగా ఉండి నేరాల నియంత్రణకు సహకరించాలని డిఎస్‌పి కె.కేశప్ప పేర్కొన్నారు. ఎస్‌పి గంగాధర్ రావు ఆదేశాల మేరకు పట్టణంలోని అక్షయఫంక్షన్ హాల్లో పట్టణంలోని లారీ, మినీ లారీ, ఐచర్, కారు యజమానులతో ఆయన సమావేశమై కొత్త వ్యక్తులు, అనుమానిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏదైనా రవాణా చేసే సమయంలో వారి అడ్రస్ ప్రూఫ్ తప్పనిసరిగా తీసుకోవాలనితెలిపారు. అక్రమ రవాణాకు సంబంధించిన సమాచారం రహస్యంగా తమకు తెలపాలన్నారు. డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని దిశ యాప్ తప్పకుండా డౌన్లోడ్ చేసుకోవాలని తెలిపారు. డ్రైవర్లు తమ ప్రయాణ సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఓనర్లకు తెలపాలని, త్వరలో డ్రైవర్లకు కూడా వైద్య శిబిరాలు నిర్వహించి తమ వంతు సహకారం అందిస్తామని అన్నారు. వాహనదారులు రికార్డులు సక్రమంగా కలిగి ఉండాలని చెప్పారు. టూ టౌన్ సిఐ ఎస్‌జమురళీకృష్ణ మాట్లాడుతూ రాత్రి పూట ప్రయాణించే సమయంలో ఒక గంట పాటు తప్పనిసరిగా

సమావేశంలో మాట్లాడుతున్న డిఎస్‌పి కేశప్ప

విశ్రాంతి తీసుకోవాలని తెలిపారు. డ్రైవర్ల సంక్షేమ ని దృష్టిలో పెట్టుకొని స్టాప్ అండ్ వాష్ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని పేర్కొన్నారు. ప్రతి ఒక్క డ్రైవరు బాధ్యతగా వ్యవహరిస్తే ప్రమాదాలు చాలా వరకు నివారించ వచ్చన్నారు. డ్రైవింగ్ సమయంలో తమ కుటుంబ సభ్యులను గుర్తుంచు కోవాలని సూచించారు. సమావేశంలో ఎస్ఐలు చంద్రమోహన్, హరి హరప్రసాద్, చంద్రశేఖర్, వాహనదారులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

ముస్లిం మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట : ఎంపీ

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ మిథున్ రెడ్డి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ముస్లిం మైనార్టీ సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని టిప్పు మైదానం జామియా మసీద్ ప్రహరీగోడ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ముందుగా రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో ఎమ్మెల్యే నవాజ్ బాషాతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ సిఎం జగన్‌మోహన్‌రెడ్డి గత ఏడాది మదనపల్లి పర్యటనకు చేసిన సందర్భంలో జామియా మసీదు ప్రహరీగోడ నిర్మాణానికి రూ.2 కోట్లు ఇస్తామని హామీనిచ్చి, కలెక్టర్ ద్వారా విడుదల చేయించారని అన్నారు. మసీదు అభివృద్ధికి రూ.5కోట్లు మంజూరు చేయిస్తా మన్నారన్నారు. ఎపిఎండిసి చైర్మన్ షమీంఅస్లాం మాట్లాడుతూ ఎపిఎండిసి కార్పొరేషన్ నిధులు రూ.2 కోట్లతో ప్రహరీగోడ చేపట్టా మన్నారు.వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ, నిధుల విడుదల విషయంలో ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలు అవాస్తవమని కొట్టిపారేశారు. కార్యక్రమంలో చిత్తూరు ఎంపీ ఎన్.రెడ్డెప్ప, వైసిపి రాష్ట్ర కార్యదర్శి నరేష్‌కుమార్‌రెడ్డి, మార్కెట్ కమిటీ తట్టి శ్రీనివాసులు రెడ్డి, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ ఎస్.ఎ.కరీముల్లా, మున్సిపల్ చైర్‌పర్సన్ వి.మనూజరెడ్డి, వైస్‌చైర్మన్లు నూర్‌ఆజామ్, జింకా వెంకటా చలపతి, కురబ కార్పొరేషన్ డైరెక్టర్ దండురామాంజులు, కౌన్సిలర్లు వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు

రామాపురం : రామాపురం పోలీస్‌స్టేషన్‌ను ఎస్‌పి గంగాధర్‌రావు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ కర్నూలు-చిత్తూరు 40వ జాతీయ రహదారిలోని రామాపురం మండలంలో ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని అన్నారు. ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి కలెక్టర్‌కు నివేదిక పంపినట్లు తెలిపారు. ముఖ్యంగా జిల్లాలో 63 ప్రాంతాల్లో ప్రమాద స్థలాలుగా గుర్తించి, వాటికి కావలసిన జాతీయ రహదారి నియమాలు, ప్రమాద నివారణకు సంబంధించిన బోర్డులను, డివైడర్లను రోడ్డుపై ఏర్పాటు చేస్తామన్నారు. ప్రమాదాల నివారణకు సిగ్నల్ లైట్లు ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో లక్కిరెడ్డిపల్లి సిఐ వరప్రసాద్, ఎస్ఐ కొండారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

నగర పంచాయతీకి చేరిన ట్రాక్టర్లు

బి.కొత్తకోట : స్థానిక నగర పంచాయతీ కార్యాలయం ఆవరణంలో శుక్రవారం ఎంపీ మిథున్‌రెడ్డి నిధుల నుండి మూడు ట్రాక్టర్లను మంజూరు చేశారు. వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు పాగొండ ఖలీల్‌అహ్మద్ రిబ్బను కట్ చేసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర పంచాయతీ అభివృద్ధికి ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి, ఎంపీ సహకారం మరువలేనిదని ప్రజల తరపున వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలోజడ్‌పిటిసి రామచంద్ర యాదవ్, మండల కన్వీనర్ ప్రదీప్‌రెడ్డి, మార్కెట్‌యార్డ్ డైరెక్టర్ అయుబ్ బాషా, భీముగాని ప్రభాకర్‌రెడ్డి, హౌసింగ్ సొసైటీ ఉపాధ్యక్షుడు కంచి సురేందర్‌రెడ్డి, ప్రభుత్వ ఆస్పత్రి కమిటీ డైరెక్టర్ నక్కా మహేష్, నాలుగో సచివాలయం కన్వీనర్ కంచి కళ్యాణ్ కుమార్‌రెడ్డి, సిఆర్ చిన్నికృష్ణ, ఒకటో సచివాలయం కన్వీనర్ చాంద్ బాషా, అంజమ్మల, జీవి రామకృష్ణ, గుడిపల్లి సర్పంచ్ రఘు, సచివాలయం కన్వీనర్ నక్కసంతోష్, కో-ఆప్షన్ మెంబర్‌నాసర్, వైసిపి నాయకులు రాయల్ సలీం, జనార్ధన్, సాదిక్, జనుపువారిపల్లి శ్రీనివాసులు, బసిరెడ్డి, మేడా రాఘువ, కటికి కృష్ణారెడ్డి, పట్టణం కన్వీనర్ రాజన్న, సబ్జీ, నరసింహనాయుడు, రాయలసీమ రమేష్ రెడ్డి, ప్రదీప్, సద్దాం, సాయి, సర్పంచులు, ఎంపిటిసిలు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, వాలంటీర్లు, నగర పంచాయతీ ఎఒ రమాదేవి పాల్గొన్నారు.

విద్యతో పాటు వినయ, విధేయతలు అవసరం

ప్రజాశక్తి-పీలేరు

పిల్లలకు విద్యతో పాటు వినయ, విధేయతలు కూడా చాలా అవసరమని పీలేరు అర్బన్ సిఐ మోహన్‌రెడ్డి తెలిపారు. బుధవారం పీలేరు శ్రీచైతన్య స్కూల్లో ఐఎన్‌టిఎస్ఒ ఒలంపియాడ్ పరీక్షల్లో సత్తా చాటిన 135 మంది విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ విద్యార్థులు తల్లిదండ్రుల పట్ల గౌరవ, మర్యాదలతో మెలగాలని అన్నారు. సెల్ ఫోనును విజ్ఞానాభివృద్ధికి మాత్రమే వాడలన్నారు. శ్రీచైతన్య స్కూల్ ఎజిఎమ్ డాక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ పిల్లలు విద్యార్థి దశ నుంచే తమ మేథస్సుకు పదును పెట్టడం చాలా అవసరమని, సాంకేతికతను అంది పుచ్చు కోవాలని అన్నారు. కార్యక్రమంలో అకడమిక్ డీన్ జానకీరామ్, పరీక్షల ఇన్‌ఛార్జి శిరీష పాల్గొన్నారు.

'మిట్స్'లో జాతీయ స్థాయి సాంకేతిక సింపోజియం

ప్రజాశక్తి-కురబలకోట

అంగళ్ళు సమీపంలో మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో డిపార్ట్మెంట్ ఆఫ్ మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం వారు జాతీయ స్థాయి సాంకేతిక సింపోజియం మేకొనన్స్ -2023ను ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్.మామిళ్ళ రవిశంకర్ పాల్గొని మాట్లాడారు. మెకానికల్ ఇంజనీరింగ్ ఎవర్ గ్రీన్ అని, కోర్ జాబ్స్ చేసే వారికి కెరీర్ గ్రోత్ బాగుంటుందని అన్నారు. మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థులకు 3డి ప్రింటింగ్, డ్రోన్ టెక్నాలజీ, ఇవి ఆపరేటెడ్ వెహికల్స్ మొదలైన రంగాలలో ఉద్యోగ అవకాశాలు మెరుగ్గా ఉన్నాయని అన్నారు. ప్రిన్సిపల్ యువరాజ్ మాట్లాడుతూ ఈ జాతీయ స్థాయి సాంకేతిక సింపోజియంకు దేశ నలుమూలల నుంచి సుమారు 200 మంది విద్యార్థులు టెక్నికల్ పేపర్ ప్రెజెంటేషన్, క్విజ్, ప్రాజెక్ట్ ఎక్స్‌పో, ఆటో క్యాడ్ డ్రాయింగ్, ఈవెంట్‌లలో పాల్గొనడానికి వచ్చారని అన్నారు. విభాగాధిపతి డాక్టర్ లక్ష్మణరావు మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించడానికి ప్రోత్సహించిన కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎన్.విజయ భాస్కర్ చౌదరికి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల కు కృతతలు తెలిపారు.

అందరికీ అందుబాటులో ఉచిత న్యాయం : జడ్జి

ప్రజాశక్తి-నందలూరు

ఒక ఏడాది ఆదాయం మూడు లక్షల లోపు ఉన్న వారికి ఉచిత న్యాయం అందుబాటులో ఉంటుందని మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి కె.లత అన్నారు. శుక్రవారం స్థానిక జూనియర్ సివిల్ జడ్జ్ కోర్టు ఆవరణంలో జాతీయ లోక్ ఆదాలత్‌పై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. మే 13న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను అందరూ సద్వినియోగం చేసుకొని రాజీ పడదగిన కేసులు రాజీ చేసుకోవాలని తెలిపారు. ఏదైనా సమస్య ఉంటే మండల్ లీగల్ సర్వీసెస్ కమిటీలో అర్జీ ఇస్తే అది ప్రీ లీటిగేషన్ కేసు కింద వారిని పిలిచి విచారించి సమస్య పరిష్కరిస్తామని తెలిపారు. లోక్ అదాలత్ ద్వారా కేసులు పరిష్కరించుకుంటే కక్షిదారులు ఇద్దరూ గెలుస్తారని, రాజీయే రాజ మార్గమని అన్నారు. సదస్సులో ఎఎస్ఐ సుబ్బరాయుడు, న్యాయవాదులు సిహెచ్. ఆనంద్‌కుమార్, ఎస్.మహమ్మద్అలీ, జి.సుబ్బరామయ్య, ఎంఎల్‌సి, కోర్టు సిబ్బంది, పిఎల్‌విలు, కక్షిదారులు, పోలీసులు పాల్గొన్నారు.

నేటి నుంచి మహాభారత యజ్ఞం

గాలివీడు : స్థానిక లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం పరిధిలో ఈనెల 22 నుంచి మే నెల నాలుగో తేదీ వరకు మహాభారత యజ్ఞంను దాతల సాయంతో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పెద్దరాజా తెలిపారు. రాష్ట్రస్థాయి అవార్డు గ్రహీత వాణిశ్రీ భాగవతారాణి హరికథ మహాభారత విజ్ఞానాన్ని వివరిస్తారని చెప్పారు. వృద్ధులు సమయాన్ని వృథా చేసుకోకుండా మహాభారతయజ్ఞం కథనాలు ఆస్వాదించి సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మత సామరస్యానికి ప్రతీక రంజాన్ : 'చమర్తి'

ప్రజాశక్తి-నందలూరు

మతసామరస్యానికి ప్రతీక రంజాన్ పండుగని నియోజకవర్గ టిడిపి నాయకులు చమర్తి జగన్మోహన్‌రాజు అన్నారు. శుక్రవారం మండలంలోని నాగిరెడ్డిపల్లె, నీలిపల్లి, టంగుటూరు గ్రామాల్లో ఆయన ఏర్పాటుచేసిన రంజాన్ తోఫాను ముస్లిం సోదరులకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పండుగను సంతోషంగా జరుపుకునే రంజాన్ తోఫాను అందించారని అన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత తోఫాను రద్దు చేసి పేదవారికి సంతోషం లేకుండా చేశారని అన్నారు. కార్యక్రమంలో బిసి నాయకులు, మాజీ సర్పంచ్ సమ్మెట శివప్రసాద్, మాడపూరి హేమలత, తోట శివశంకర్, షేక్ నూరుల్లా, కల్లూరు సుబ్బరాయుడు, రియాజ్, కాజా, పీరా, జుల్ఫికర్, షఫీఉల్లా, ఫయాజ్, సతీష్‌రాజు, శేషారెడ్డి, వెంకటేష్, సూర్యరాజు, రాజేష్‌వర్మ, వినోద్‌రెడ్డి, రాజశేఖర్ తోటమల్లి, ఆదిసురేష్ పాల్గొన్నారు.

రంజాన్ తోఫాను పంపిణీ చేస్తున్న చమర్తి జగన్మోహన్‌రాజు

అవినీతి, అక్రమాలపై చర్చించేందుకు సిద్ధం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

అవినీతి అక్ర మలపై చర్చిం చేందుకు నేను సిద్ధంగా ఉన్నానని మాజీ ఎమ్మెల్యే కూడా అందుకు సిద్ధం కావాలని ఎమ్మెల్యే నవాజ్ బాష సవాల్ విసిరారు. శుక్రవారం స్థానిక వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రంజాన్‌మాసంలో మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తప్పుడు ఆరోపణ చేయడం మానుకోవాలని అన్నారు. గతంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మదనపల్లికి వచ్చినప్పుడు ముస్లిం మైనార్టీలకు మసీదుకు ఐదు కోట్లు, టిప్ సుల్తాన్ మైదానానికి ప్రహరీ గోడ కోసం రెండు కోట్లు కేటాయిస్తానని హామీ ఇవ్వడం జరిగిందని అన్నారు. హామీ మేరకు ఎంపీ మిథున్ రెడ్డి రాష్ట్ర మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ నుంచి రెండు కోట్ల నిధులు సిఎస్ఆర్ నిధి నుంచి కేటాయించారని అన్నారు. తనపై చేసిన అవినీతి ఆరోపణలకు నేను చర్చించడానికి మసీదుకు రావాలని సవాల్ విసిరారు. గతంలో మీరు చేసిన అవినీతి అక్రమాలపై సిఐడి దృష్టికి తీసుకెళతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎపిఎండిసి చైర్మెన్ గుండ్లూరి షమీమ్అస్లాం, మునిసిపల్ వైస్ చైర్మన్ నూర్ అజం, కౌన్సిలర్ రఫీ, నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

వక్ఫ్ ఆస్తుల పరిరక్షణలో వైసిపి విఫలం : మాజీ ఎమ్మెల్యే

మదనపల్లె అర్బన్:

వక్ఫ్‌బోర్డు నిబంధనలకు విరు ద్ధంగా మద నపల్లెలో రూ.25 కోట్ల ఆస్తిని, షెడ్లను, సామగ్రిని అధికార పార్టీ నాయ కులు ధ్వంసం చేశా రని మాజీ ఎమ్మెల్యే, టిడిపి నాయకులు షాజహాన్ బాషా ఆరోపించారు. శుక్రవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరులు సమావేశంలో మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.4 కోట్ల రూపాయలు విలువైన వక్ఫ్ ఆస్తులు అక్రమణ జరిగిందని ఆరోపించారు. తాము రూ.30 కోట్ల అభివృద్ధి చేశామన్నారు. ఇందులో 110 షాపు రూములు, పేదల కోసం ఆస్పత్రి నిర్మాణం చేసినా ఎక్కడా శిలాఫలకాలు వేసుకోలేదని అన్నారు. గతంలోనే ప్రహరీనిర్మాణం కోసం రూ.3.5కోట్లు ఖర్చు చేశామని వివరించారు. వాస్తవలు చెప్పడం లేదన్నారు. మైనార్టీల పట్ల ప్రభుత్వానికి చిత్త శుద్ధి లేదని, ఇందుకుగాను, నాలుగేళ్ల పాలనలో రాష్ట్రంలో వేల కోట్ల వక్ఫ్ ఆస్తులు అక్రమణకు గురయ్యాయని అన్నారు. శిలా ఫలకం ఏర్పాటు చేసే ముందు రెండు కోట్ల నిధులు విడుదల జిఒ చుపించి రావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రాటకొండ మధుబాబు, శ్రీరాములు, షంషీర్, ఇంతియాజ్, రామ్మూర్తి, నీదేళ్ల శివ, మహబూబ్‌ఖాన్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న టిడిపి నాయకులు

అక్రమ నిర్మాణాలు ఆపండి

ప్రజాశక్తి-కలికిరి

పట్టణంలోని స్థానిక ఇందిరమ్మ కాలనీలో ప్రభుత్వ స్థలాల్లో స్థానికంగా ఉన్న వైసిపి నాయకులు అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని వీటిని వెంటనే ఆపాలని టిడిపి నాయకులు తహశీల్దార్ భాగ్యలతకు వినతి పత్రం అందించారు. ఎంతోకాలంగా ప్రభుత్వ అవసరాల నిమిత్తం ఖాళీగా ఉంచిన స్థలాల్లో రాత్రికి రాత్రి స్థానికంగా ఉన్న వార్డు మెంబర్లు పునాదులు నిర్మించారని వీటిని వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. వైసిపికి చెందిన ప్రముఖ నాయకుడు వీరికి అండగా నిలిచినట్లు చెబుతున్నారు. ఈ నిర్మాణాలను తొలగించకుంటే ఇందిరమ్మ కాలనీలో ఖాళీగా ఉన్న స్థలాలన్నిటిలోనూ పునాదులు వేసి ఇళ్ల నిర్మాణాలు చేపడ తామని అందుకు రెవెన్యూ అధికారులు అడ్డంకులు కలిగించరాదన్నారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి కూడా తీసుకపోయామని అన్నారు. దీనిపై స్పందించిన తహశీల్దార్ అక్రమ నిర్మాణాలు చేపట్టే వారిని ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదన్నారు. పునాదులు తొలగించేలా చర్యలు చేపడతామని టిడిపి నాయకులకు హామీనిచ్చారు. ఇటీవల జగనన్న కాలనీలో అదేవిధంగా వైసిపి నాయకులు ఆక్రమణలు చేపట్టడంతో రెవెన్యూ సిబ్బందిని కాపలాగా ఉంచినట్టు తెలిసిందే. రోజురోజుకు కలికిరిలో ప్రభుత్వ స్థలాల ఆక్రమణ అధికమైందని వైసిపి నాయకులు ఇలాంటి ఆక్రమణలకు పాల్పడటం సమంజసం కాదని తెలిపారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు నిజాముద్దీన్, సహదేవరెడ్డి, కెవి.రెడ్డి, ఉపాధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి గ్రామ సర్పంచ్ ఆర్.ప్రతాప్‌కుమార్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, టిడిపి రాజంపేట పార్లమెంటు ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, పీలేరు నియోజకవర్గం ఎస్‌సి సెల్ అగస్త్యేశ్వర, ఎస్‌టి సెల్ నాయకుడు శ్రీనివాస వర్మ, మోహన్, బిసి నాయకులు వెంకటపతి, జ్ఞాన, చల్లయ్య, చిన్న రెడ్డెయ్య పాల్గొన్నారు.

గిరిజనులతో మాట్లాడుతున్న బికెఎంయు నాయకులు

జగనన్న కాలనీలకు గిరిజనులు అర్హులు కారా ?

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

జగనన్న కాలనీలకు దళితులు, గిరిజనులు అర్హులు కారా అని బికెఎంయు నాయకులు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. వ్యవసాయ కార్మిక సంఘం రాజంపేట నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం సీతారాంపురం గ్రామపంచాయతీ పరిధిలోని గిరిజన కాలనీలో పర్యటించారు. బికేఎంయు జిల్లా అధ్యక్షులు పండుగోల మణి, నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు బేధం రాజశేఖర్, గుడిసె నరసింహులు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం రాష్ట్రంలో నిరుపేదలకు లక్ష 33 వేల ఇళ్లు జగనన్న కాలనీ పేరుతో ఇచ్చామని గొప్పలు చెప్పుకుంటున్నారని, వారికి సీతారాంపురంలోని గిరిజన కాలనీలు కనపడలేదా అని ప్రశ్నించారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు గడుస్తున్నా గిరిజనుల బ్రతుకులలో మాత్రం అభివృద్ధి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బడా నాయకులు, పెత్తందారులు భూ బకాసురులై రెవెన్యూ అధికారులకు ముడుపులిచ్చి వందలాది ఎకరాల ప్రభుత్వ బంజర భూములను ఆక్రమించి అనుభవిస్తుంటే రెవెన్యూ యంత్రాంగం చూసి చూడనట్లు వ్యవహరించడం సిగ్గుచేటని అన్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు కళ్ళు తెరచి దళిత, గిరిజనులకు ఎనిమిదో విడత అసైన్మెంట్ కమిటీ సమావేశాలు జరిపి ప్రభుత్వ బంజర భూములు ప్రతి కుటుంబానికి రెండు ఎకరాలు చొప్పున మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నియోజవర్గ ఉపాధ్యక్షులు చలంపాటి నరసింహులు, నియోజవర్గ సహాయకార్యదర్శి కోడూరు రవి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి-పుల్లంపేట

మండలంలోని పుల్లంపేట విభిన్న ప్రతిభా వంతుల సమైక్య సేవా సంఘం ఆధ్వర్యంలో ఎ.పుత్తన వారిపల్లెకు చెందిన తోట నాగశివయ్య కుమా రుడు జ్ఞాన్ అశ్విత్ పుట్టినరోజు సందర్భముగా పేదలకు, వృద్ధులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. వత్తలూరు ఎస్‌బివిడి సభా ప్రాంగణంలో ఉపాధ్యా యుడు గేని పెంచలయ్య చేతులమీదుగా సరుకులను అందించారు. ఈ సంద ర్భంగా సంఘం అధ్యక్షుడు మల్లు సుబ్బనరసారెడ్డి మాట్లాడుతూ పేదలకు సాయం చేయడం అభినందనీయన్నారు. చిన్నారి అశ్విత్ ఉన్నత విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను చేరాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రాజంపేట విభిన్న ప్రతిభావంతుల సేవా సంఘ అధ్యక్షుడు అబ్దుల్‌ఖాదర్, పివిపిఎస్ఎస్ సంఘం ఉపాధ్యక్షుడు వాహీద్, కోశాధికారి నరసింహులు, పోస్ట్ మ్యాన్ వెంకటేష్, సంఘ సభ్యుడు రెడ్డయ్యరెడ్డి, జ్యోతీశ్వర్ నాయుడు, సంఘ వాలంటీర్లు మురళి పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసర అందిస్తున్న సభ్యులు

'ఆదిత్య' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

స్టార్ లింక్ పేపర్ ప్రజెంటేషన్‌లో ఆదిత్య విద్యార్థుల ప్రతిభ కనబ రిచారు. స్థానిక పుంగనూరు రోడ్డు లోని ఆదిత్య ఇంజనీరింగ్ కళా శాలలో బిటెక్ రెండవ సంవత్సరం చదువుతున్న ఇసిఇ విభాగానికి చెందిన విద్యార్థులు మదన పల్లె ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ కాలేజీలో సాటిలైట్ ఇంటర్నెట్, స్టార్ లింక్ పేపర్ ప్రజెంటేషన్‌లో బి.పృధ్వినారాయణ, పి.నవీన్‌కుమార్‌రెడ్డి రెండవ బహుమతి గెలుపొందినారని కళాశాల డైరెక్టర్ డాక్టర్.ఎస్.రామ లింగారెడ్డి తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను ప్రెసిడెంట్ యం.నాగమల్లారెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ కె.సతీష్ బాబు, ఇసిఇ విభాగానికి చెందిన హెచ్ఒడి డాక్టర్ కె.వెంకట వరప్రసాద్‌లు అభి నందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు

బిపి, షుగర్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి

ప్రజాశక్తి-కలికిరి

బిపి, షుగర్ వంటి వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పద్మావతి జనరల్ ఆస్పత్రి వైద్యులు శివయోగి సోమశేఖర్ తెలిపారు. శుక్రవారం జెఎన్‌టియు కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎన్.సరిత ఆధ్వర్యంలో గండబోయినపల్లిలోని చిన్న కురవపల్లిలో ఉచితవైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు ఉచితంగా బిపి, షుగర్ పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ప్రస్తుతం ఎండలు ఎక్కువగా ఉన్నందున ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నీరసం, బరువు తగ్గడం, గుండె దడ వంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. క్రమం తప్పకుండా బిపి, షుగర్ పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు రాజేంద్రప్రసాద్, శివకుమార్, శ్రీరాములు, బషీర్‌ఖాన్, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.